సాక్షి అనకాపల్లి

మంగళవారం, 31, అక్టోబర్, 2023



అర్జీలకు సకాలంలో పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ రవిపట్నాన్‌శెట్టి అన్నారు. IIలో



అథ్లెటిక్స్‌లో నాగజ్యోతి ప్రతిభ

తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే... మరో వైపు తన ప్రవృత్తి అయిన ఆటల పోటీల్లో సత్తా చాటుతోంది. IIలో



వింటర్ షెడ్యూల్ ఖరారు

విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలకు వింటర్ షెడ్యూలు ఖరారైంది. IIలో

న్యూస్‌రీల్

41మంది అధ్యాపకులకు తాఖీదులు

- ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పులకు చర్యలు

అనకాపల్లి రూరల్ : గత మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనంలో పొరపాట్లు చేసిన పలువురు జూనియర్ లెక్చరర్లకు ఇంటర్ బోర్డు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన 41మందికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు,యాజమాన్యాల ద్వారా తాఖీదులు పంపినట్టు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యానారాయణ తెలిపారు. మూల్యాంకన సమయంలో వారు ఏయే తప్పులు చేశారో నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారిలో ఎక్కువ మంది శ్రీచైతన్య, నారాయణ కళాశాలలకు చెందిన వారే ఉండడం గమనార్హం. వారం రోజుల్లోగా షోకాజ్ నోటీసులకు వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో సంబంధిత అధ్యాపకులకు జరిమానా విధించడంతో పాటు ఏపీ పబ్లిక్ పరీక్షల చట్టం సెక్షన్ 10 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు నోటీసుల్లో తెలిపారు.

అన్ని రంగాల కార్మికులకు ఈ -శ్రమ్ కార్డులు

- చోడవరం సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ

చోడవరం: అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా విధిగా 'ఈ- శ్రమ్' కార్డులను పొందాలని చోడవరం సహాయక కార్మిక అధికారి పి. సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన పరిధిలో చోడవరం, సబ్బవరం, దేవరాపల్లి, కె. కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం, చీడికాడ, మాడుగుల, అరకు, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, అనంతగిరి, డుంబ్రిగుడ, జి. మాడుగుల, హుకుంపేట మండలాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టు, పారిశుద్ధ్య, తదితర రంగాల కార్మికులంతా విధిగా ఈ- శ్రమ్ కార్డులు పొందాలని సూచించారు. కార్డు కలిగిన కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షల బీమాతోపాటు 60 ఏళ్లు దాటిన వారికి పింఛన్ సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ- శ్రమ్ కార్డులకు ఉచితంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్‌వర్సిటీ పోటీలకు డైట్ విద్యార్థిని ఎంపిక

- రాజస్థాన్‌లో సౌత్‌వెస్ట్ తైక్వాండో టోర్నీకి హాజరు

అనకాపల్లిటౌన్ : అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు స్థానిక డైట్ కళాశాలకు చెందిన యు.జయశ్రీ ఎంపికైనట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.సిహెచ్. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు రాజస్థాన్‌లో సౌత్‌వెస్ట్ జోన్ తైక్వాండో నేషనల్ టోర్నమెంట్‌కు ఈ విద్యార్థిని హాజరవుతుందన్నారు.

ఉత్తరాంధ్రకు 170 అదనపు బస్సులు

- ప్రమాదం నేపథ్యంలో పలు రైళ్ల రద్దు
- ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- రద్దీగా మారిన బస్ డిపోలు, స్టేషన్లు



ద్వారకా బస్ స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం : విజయనగరం జిల్లాలో రైళ్ల ప్రమాద నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించింది. ప్రమాదం వల్ల విశాఖ నుంచి, విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. దీంతో రైళ్లలో వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. ఇలా సోమవారం అర్ధరాత్రి వరకు విశాఖపట్నం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విశాఖకు దాదాపు 170 బస్సులను నడిపింది. విశాఖలోని ద్వారకా బస్ స్టేషన్‌తో పాటు మద్దిలపాలెం, గాజువాక, వాల్తేరు డిపోల నుంచి వీటిని అందుబాటులో ఉంచింది. ఈ బస్సులను పార్వతీపురం, సాలూరు, టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు నడిపింది. సాధారణంగా ఈ ప్రాంతాలకు ప్రతి 15-30 నిమిషాలకో బస్సు సర్వీసు చొప్పున అందుబాటులో ఉంటుంది. రైళ్ల ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లే వారి కోసం ఈ అదనపు సర్వీసులను నడిపారు. సోమవారం మధ్యాహ్నం వరకు 70 బస్సులను పంపగా, ప్రయాణికుల రద్దీ పెరుగుతుండడంతో మరో వంద బస్సులను సమకూర్చారు. సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి కూడా విశాఖపట్నం వైపునకు అదనపు బస్సు సర్వీసులను నడిపేలా చర్యలు తీసుకున్నామని ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ 'సాక్షి'కి చెప్పారు. రైళ్ల దుర్ఘటన అనంతరం ఆదివారం అర్ధరాత్రి దాటే వరకు విశాఖ, విజయనగరంల నుంచి ప్రమాద స్థలికి ఆర్టీసీ బస్సులను పంపించామన్నారు. క్షతగాత్రులతో పాటు ప్రయాణికులను వాటిలో ఆస్పత్రులకు, విశాఖ, విజయనగరాలకు తరలించినట్టు తెలిపారు.

అదనపు బస్సులతో ఊరట

రైళ్ల రద్దుతో తమ గమ్యాలకు చేరుకోవడం ఎలా? అంటూ మదన పడుతున్న ప్రయాణికులు ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ బస్సులతో ఊరట చెందారు. రెగ్యులర్‌తో పాటు అదనపు బస్సులతో ఆయా డిపోలు, బస్‌స్టేషన్లు రద్దీగా మారాయి. బస్సుల్లో సీట్లన్నీ నిండిపోయాయి. పలు బస్సులు నూరు శాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. రైళ్లు రద్దయ్యాయన్న బెంగ లేకుండా సమయానికి గమ్యస్థానం చేరుకునేలా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఏర్పాటు చేయడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.



విశాఖలోని ద్వారకా బస్ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

బస్సుల్లో ఆక్యుపెన్సీ ఫుల్

మరోవైపు రైళ్ల రద్దుతో వాటిలో ప్రయాణించాల్సిన వారు బస్సులను ఆశ్రయించారు. ఇలాంటి వారి కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ అదనపు బస్సులతో పాటు రెగ్యులర్ బస్సులు పూర్తి ఆక్యుపెన్సీతో నడిచాయి. చాలా బస్సులు నూరు శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో కిటకిటలాడుతూ రాకపోకలు సాగించాయి. సాధారణంగా హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే రెగ్యులర్ బస్సుల్లో ఓఆర్ 50-60 శాతానికి మించవు. అలాంటిది సోమవారం ఆ బస్సుల సీట్లు కూడా ఫుల్ అయ్యాయి.

సీఎం జగన్‌కు సాదర స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరి వెంకట కుమారి, చిత్రంలో ఎంపీ సత్యవతి



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం (విశాఖ) : విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను, గాయపడిన వారికి పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విమానంలో సోమవారం మధ్యాహ్నం 1.19 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడ నుంచి 1.32 గంటలకు హెలికాప్టర్‌లో నేరుగా విజయనగరం వెళ్లారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్ జయ తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సీఎం అదనపు కార్యదర్శి కె.ధనుంజయ రెడ్డి విజయనగరం వెళ్లారు. బాధితులను పరామర్శించి సాయంత్రం 3.38 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు సీఎం జగన్ చేరుకున్నారు. ఇక్కడ నుంచి ప్రత్యేక విమానంలో 3.58 గంటలకు గన్నవరం బయలుదేరారు. ఆయనకు మంత్రులు, అధికారులు వీడ్కోలు పలికారు.

విశాఖలో ఏడుగురికి చికిత్స



రైల్వే హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బి.తేజేశ్వరరావు, పి.శ్రీనివాసరావు



కేజీహెచ్ క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న ఎం.వరలక్ష్మి, గొట్ట కమలమ్మ

- కేజీహెచ్‌లో నలుగురు, రైల్వే ఆస్పత్రిలో ఇద్దరు, అపోలో ఆస్పత్రిలో ఒకరు
- రైల్వే ఆస్పత్రిలో చేరిన స్పెషల్ గార్డు మరిపి శ్రీనివాసరావు మృతి

మహారాణిపేట/తాటిచెట్లపాలెం: విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో గాయపడిన మొత్తం ఎనిమిది మంది క్షతగాత్రులను విశాఖపట్నం తరలించారు. కేజీహెచ్‌లో నలుగురిని, ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో ఒకరిని, రైల్వే హాస్పిటల్లో ముగ్గురిని చేర్పించారు. వీరిలో పలాస పాసింజర్ స్పెషల్ గార్డు మరిపి శ్రీనివాసరావు(53) ఆదివారం రాత్రే రైల్వే ఆస్పత్రికి తీసుకువచ్చిన కొద్ది సమయంలోనే మరణించారు. ఈయన నగరంలో ఆరిలోవ ప్రాంతంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. బి.తేజేశ్వరరావు, పి.శ్రీనివాసరావులు రైల్వే హాస్పిటల్లోనే చికిత్స పొందుతున్నారు. కేజీహెచ్‌కు తీసుకొచ్చిన నలుగురిలో విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన నల్ల కుమారి(30), గాజువాక దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ముర్రు లక్ష్మి(40)కి సోమవారం శస్త్ర చికిత్స నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా సింగపురం గ్రామానికి చెందిన మోహిద వరలక్ష్మి(45), శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన గొట్ట కమలమ్మ(43) కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. రైలు ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్సలు అందించడానికి కేజీహెచ్ నుంచి నలుగురు వైద్యులు విజయనగరం వెళ్లారు.

తంగేడు కంటతడి

కోటవురట్ల: లోకో పైలట్ శింగంపల్లి మధుసూదనరావు మృతి అంతులేని దుఃఖాన్ని మిగిల్చింది. మృతదేహం కూడా దొరక్కుండా కొన్ని శరీర భాగాలు మాత్రమే లభించడంతో కుటుంబసభ్యులు చివరిచూపునకు కూడా నోచుకోలేకపోయారు. భార్య సూర్యలతను ఓదార్చడం ఎవరితరం కాలేదు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం తంగేడుకు తరలించారు. మృతదేహం కోసం ఎదురు చూస్తున్న కుటుంబసభ్యుల రోదనలు ఒక్కసారిగా మిన్నంటాయి. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై మధుసూదనరావుకు కన్నీటి వీడ్కోలు పలికారు.



మధుసూదనరావు చిత్రపటం వద్ద నివాళి

ఆరిలోవ, తంగేడులో విషాదఛాయలు

ఈ ప్రమాదంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌లో ఉంటున్న మరిపి శ్రీనివాసరావు(53) పలాస పాసింజర్‌కు స్పెషల్ గార్డుగా ఉండగా.. కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి మధుసూదనరావు(53) రాయగడ పాసింజర్ (08504)కు లోకో పైలట్‌గా ఉన్నారు. మధుసూదనరావు ఉద్యోగరీత్యా విశాఖలోని 52వ వార్డు న్యూ కరాసాలో ఉంటున్నారు. ఈయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావుకు వృద్ధాప్యంలో ఉన్న తల్లితో పాటు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న భార్య అమల, పీజీ చదువుతున్న కుమార్తె హర్షప్రియ, ఏయూలో బీటెక్ చదువుతున్న కుమారుడు చంద్రదీప్ ఉన్నారు. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం/అనకాపల్లి టౌన్ : విజయనగరం జిల్లాలో రైళ్ల ప్రమాద ఘటన నేపథ్యంలో ఆయా స్టేషన్ల నుంచి సోమ, మంగళవారాల్లో బయల్దేరాల్సిన సుమారు 47 రైళ్లు రద్దు చేయగా 24 రైళ్లను దారి మళ్లించారు. అలాగే 8 రైళ్ల గమ్యం కుదించగా మరో 8 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. దీంతో రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఖాళీగా దర్శనమిచ్చాయి. రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ అరుణశ్రీ పర్యవేక్షణలో క్యాన్సిలేషన్, హెల్ప్ లైన్, ఎంక్వయిరీ వద్ద ప్రయాణికులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. రైళ్ల రద్దు సమాచారం ప్రయాణికులకు మెసేజ్‌లు, మీడియా ద్వారా తెలియజేశారు. రత్నాచల్‌తోపాటు పలు రైళ్లు రద్దు కావడం వల్ల అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది చెందారు. సోమవారం సాయంత్రం నుంచి పలు రైళ్లను అంచెలంచెలుగా పునరుద్ధరించడంతో ప్రయాణికులకు ఊరట లభించింది. విశాఖపట్నం నుంచి విజయవాడ, కేకే లైన్ వైపు రైళ్లు మాత్రం యథావిధిగానే నడిచాయి. రత్నాచల్ రైలు మంగళవారం నుంచి యథావిధిగా నడస్తుందని స్థానిక రైల్వే అధికారులు పేర్కొన్నారు.

మరికొన్ని రీ షెడ్యూల్, గమ్యం కుదింపు

నేడు రద్దయిన రైళ్లు

విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, తిరుపతి-విశాఖపట్నం(08584) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, కోరాపుట్ - విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, రాయగడ-విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్, విజయనగరం-విశాఖపట్నం(07469) మెము స్పెషల్, తిరుపతి-పూరీ(17480) ఎక్స్‌ప్రెస్, పలాస-విశాఖపట్నం (08531) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం(08522/08521), విశాఖపట్నం-రాయగడ(08504) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-పలాస(08532) పాసింజర్ స్పెషల్, హౌరా-సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు(12245) దురంతో ఎక్స్‌ప్రెస్, షాలిమర్-హైదరాబాద్(18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్



ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులు

ఒకటో తేదీన రద్దు చేసిన రైళ్లు

రాయగడ-విశాఖపట్నం(08503) పాసింజర్ స్పెషల్, పలాస - విశాఖపట్నం(08531) పాసింజర్ స్పెషల్. అలాగే మంగళవారం ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లు రీ షెడ్యూల్ చేశారు. అక్కడ బయల్దేరిన సమయాన్ని బట్టి ఆయా స్టేషన్లకు అంతే ఆలస్యంగా చేరుకోనున్నాయి. మంగళవారం భువనేశ్వర్‌లో ఉదయం 05.40 గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్-బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 10 గంటలకు బయల్దేరుతుంది.

2వ తేదీ నుంచి ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం

అనకాపల్లిటౌన్ : జిల్లాలో అచ్యుతాపురం ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో కేంద్రంలో గిరిజన యువత ఎక్స్ఛేంజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేంద్ర యువజన వ్యవహారాలు , క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి జి.మహేశ్వరరావు చెప్పారు. స్థానిక గవరపాలెంలో తన కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. గిరిజన యువత అభివృద్ధికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, హోం మంత్రిత్వశాఖలు సంయుక్తంగా 15వ గిరిజన యువత ఎక్స్ఛేంజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాయన్నారు. ఒక రాష్ట్రంలో జీవన శైలి, అభివృద్ధి పరిస్థితిని మరొక రాష్ట్రం వారు తెలుసుకోవాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. అందులో భాగంగా జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది జిల్లాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు హాజరవుతున్నారని చెప్పారు. హోం మంత్రిత్వశాఖకు చెందిన సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ అధికారులు యువతకు ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తారన్నారు. ఏడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి 'సాధికారత, మత, ప్రాంతీయ, తీవ్రవాదం, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొవడంలో సవాళ్లు, పరిష్కారాలు, ఐక్యత, స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయ సమైక్యతలో యువత పాత్ర, గిరిజన ప్రాంతాల సమస్యలు, ఉపాధి కల్పన, నవ భారతదేశం విజన్, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్, ఆర్గనైజేషన్ ఆఫ్ యూత్ పార్లమెంట్, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ, వక్తృత్వం, గిరిజన సంప్రదాయ నాట్య పోటీలు జరుగుతాయన్నారు.

సామాజిక విజయ భేరి



సభా స్థలికి పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు

- పాడేరుకు పోటెత్తిన ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చిన గిరిజనులు



పాడేరులో సామాజిక సాధికార సభకు హాజరైన అశేష గిరిజన వాహిని



సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, వేదికపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి, తదితరులు

సాక్షి,పాడేరు: ఎటు చూసినా జనమే... అందరి ముఖాల్లోనూ ఆనందమే... జీపులు, కారులు, ద్విచక్రవాహనాలు... ఇలా ఎవరికి అందుబాటులో ఉన్న వాహనాల్లో వారు, మరికొందరు నడుస్తూ వేల సంఖ్యలో పాడేరు చేరుకున్నారు. రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. థింసా నృత్యాలు..డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. ఇక్కడ సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర గిరిజన జాతరను తలపించింది.

పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాది మంది గిరిజనులు స్వచ్ఛందంగా ఉదయం 10 గంటలకే పాడేరు చేరుకున్నారు. చింతలవీధి పంచాయతీ తలారిసింగి మెడికల్ కళాశాల సెంటర్ నుంచి పాతబస్టాండ్, పాడేరు మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద సభా వేదిక వరకు ప్రజలు కిక్కిరిశారు. వైఎస్సార్‌సీపీ జెండాలు పట్టుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. తలారిసింగి మెడికల్ కళాశాల భవన నిర్మాణాల ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి జెండా ఊపి సామాజిక సాధికార బస్సుయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీలు డాక్టర్ కుంభా రవిబాబు, లేళ్ల అప్పిరెడ్డి, పాడేరు, అరకులోయ, రాజాం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, కంబాల జోగులు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఫరూఖీ,నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్‌లు జల్లిపల్లి సుభద్ర, డాక్టర్ శోభ స్వాతిరాణి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్ర మన్యం ప్రజల్లో జోష్ నింపింది.

బహిరంగ సభ అదుర్స్

పాడేరు మెయిన్‌రోడ్డులో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. సభ జరిగిన విజయ కట్‌పీస్ సెంటర్ నుంచి స్టేట్‌బ్యాంకు వరకు వేల సంఖ్యలో ప్రజలతో కిక్కిరిసిపోయింది. సుమారు నాలుగు వేల వరకు వేసిన కుర్చీలన్నీ మహిళలతోనే నిండిపోయాయి. వారంతా వైఎస్సార్‌సీపీ టోపీలు ధరించి, జెండాలతో సందడి చేశారు. సభ ముగిసేంతవరకు ప్రజలు ఉత్సాహంగా నేతల ప్రసంగాలు విన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి బహిరంగ సభ వేదికపై నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను ప్రభుత్వం రెగ్యులర్ చేయడంతో వారంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సభలో థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులను ప్రదర్శించారు. డిప్యూటీ సీఎంలు, అరకు ఎంపీ, పాడేరు, అరకులోయ, రాజాం ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యాత్ర సందర్భంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు, కళాశాల నమూనాను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. అంతకు ముందు స్థానిక గిరిజన కళాకారులు థింసా నృత్యం చేస్తూ వీరికి ఘన స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న కళా రూపకాలు

వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి ఆధ్వర్యంలో జానపద కళాకారులు పాటలు, నృత్యాలతో హోరెత్తించారు. మెయిన్‌రోడ్డు సతకంపట్టు వద్ద ఏర్పాటుచేసిన సభావేదికపై సుమారు 3గంటల పాటు కళాకారుల పాటలు, డ్యాన్‌లతో అందరిని అలరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మంచిని వివరిస్తూ గీతాలు ఆలపించారు. తలారిసింగి మెడికల్ కళాశాల భవన నిర్మాణాల ప్రాంతం, పాతబస్టాండ్, సతకంపట్టు వద్ద మూడు బృందాల గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. తీన్‌మార్ బ్యాండు మోతతో పాడేరు పట్టణం మరింత సందడిగా మారింది.

నేడు ఇమ్యూనిటీ రన్

అనకాపల్లిటౌన్ : అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో స్థానిక రింగ్‌రోడ్డు కూడలి వద్ద మంగళవారం ఉదయం 6 గంటలకు జిల్లా కలెక్టర్ రవిపట్నాన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణలు ఇమ్యూనిటీ రన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు పట్టణ సీఐ దాడి మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

2న మాడుగులలో సామాజిక సాధికార బస్సు యాత్ర

• ఏర్పాట్లు పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


సభా స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వచ్చే నెల 2న సామాజిక సాధికార బస్సు యాత్ర సభను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సభా స్థలిని పరిశీలించారు. నియోజకవర్గం నలుమూలాల నుంచి భారీ స్థాయిలో జనం రానున్నారని, ఆ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని పార్టీ నాయకులకు సూచించారు. భారీ కటౌట్లు, వాహనాలకు పార్కింగ్, తదితర వాటిపై సూచనలు ఇచ్చారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, జంపెన, ఎం. కోడూరు సర్పంచ్‌లు గురువునాయుడు, గొల్లవిల్లి సంజీవరావు, నాయకులు శ్రీనాథు జగ్గారావు, బొద్దపు భాస్కరరావు, కాత వెంకటరమణ, పాము వెంకటరావు, కరణం రాము, ఎం. అశోక్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో ఏపీజీవీబీ ముందంజ


ఏపీజీవీబీ బ్రాంచి నూతన భవన సముదాయం ప్రారంభిస్తున్న ఆర్ఎం వెంకటేశ్వర్లు

పాయకరావుపేట : దేశంలో బ్యాంకింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) ముందంజలో పయనిస్తోందని బ్యాంకు రీజనల్ మేనేజర్ పీసీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని ఏపీజీవీబీని నూతన భవన సముదాయంలోనికి మార్చిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తమ బ్యాంకు దేశ వ్యాప్తంగా రూ.55 వేల కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందన్నారు. గత సంవత్సరం రూ.1050 కోట్లు లాభం పొందిందన్నారు. బ్యాంకులో పంట, బంగారు ఆభరణాలు, ఇళ్ల నిర్మాణాలు, భూములు, వ్యాపార సంబంధింత రుణాలు, అతి తక్కువ వడ్డీ రేటుకే పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకులో చేసుకునే డిపాజిట్‌లపై ఎక్కువ వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు విద్యా రుణాలు రుణాలు కూడా మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి 3 నెలలకు ఒకసారి బ్యాంకు ఖాతాదారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏపీజీవీబీకి రీజనల్ కార్యాలయం జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరమైన చోట్ల కొత్త బ్రాంచిలు ఏర్పాటు చేస్తామన్నారు. పాయకరావుపేట బ్రాంచిలో 15వేల మంది ఖాతాదారులు ఉన్నారని, ఇక్కడ బ్యాంకులో రూ.26 కోట్లు డిపాజిట్లు సేకరించడం జరిగిందన్నారు. రూ. 50 కోట్లు రుణాలు మంజూరు జరిగిందన్నారు. బ్యాంకులో అతితక్కువ ఖర్చుతో లాకర్ సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నారు. అనంతరం చనిపోయిన ఖతాదారుల కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు బీమా చెక్‌ను ఆర్ఎం చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ సీనియర్ మేనేజర్లు కాశీప్రసాద్, ఆనంద్‌కుమార్, జిల్లా ఆర్.ఎస్. సాయికిరణ్, బ్రాంచి మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల అర్జీలకు సకాలంలో పరిష్కారం

• క్షేత్ర స్థాయిలో విచారణ చేసి తక్షణం పరిష్కరించాలి
• మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
• కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
• కలెక్టరేట్‌లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి 445 అర్జీలు


కలెక్టరేట్ గేటు వద్ద బారులు తీరిన అర్జీదారులు


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

తుమ్మపాల : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలు పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ఆయనతో పాటు జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణరాజ్, జెడ్పీ సీఈవో పోలినాయుడు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు చేసుకునే వారికి వ్యక్తిగతంగా విచారణ చేసి సమస్యలు పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం చేసే దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలించి లబ్ధి అందించేలా పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. మండలస్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హులై ఇల్లు లేని ప్రతి కుటుంబానికి జగనన్న పట్టాలు పంపిణీ చేయాలన్నారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే చర్యలు చేపట్టడం ద్వారా అర్జీల సంఖ్య తగ్గుతుందన్నారు. మొత్తం 445 అర్జీలు నమోదవ్వగా అధికంగా భూ సమస్యలపై రైతులు ఫిర్యాదులు చేశారు.

పోటెత్తిన అర్జీలు....

గత రెండు వారాలు కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమం వివిధ కారణాల దృష్ట్యా జరగకపోవడంతో ఈ వారం జిల్లావ్యాప్తంగా అర్జీదారులు పోటెత్తారు. దీంతో కలెక్టరేట్‌లో స్పందన అర్జీల నమోదు కౌంటర్లను అదనంగా మరో నాలుగు పెంచారు. మొత్తం 8 కౌంటర్ల ద్వారా అర్జీలను నమోదు చేసినప్పటికి ప్రజలు మాత్రం క్యూలైన్లలో గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. కలెక్టరేట్ బయట వరకు జనం బారులు తీరారు. నిరక్ష్యరాసులు, అవగాహన లేమితో వచ్చిన అర్జీదారుల ఫిర్యాధులు తయారుచేయడానికి సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. మొదటి అంతస్తులో జరిగే స్పందన వేదిక వద్దకు వెళ్లలేని వృద్ధులు, వికలాంగులను కిందనే ఉంచడంతో గ్రామవార్డు సచివాలయ అధికారిని మంజులావాణి వారి వద్దకు వచ్చి వారి అర్జీలను పరిశీలించారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యలు తక్షణ పరిష్కరించాలని ఆదేశించారు.

వరి రైతులను ఆదుకోండి

జిల్లాలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో రైతాంగం పూర్తిగా దెబ్బతిందని, వరినాట్లు ఎక్కడిక్కడ ఎండిపోయి నష్టపోయారని, ప్రభుత్వం దృష్టి సారించి కరువు జిల్లాగా ప్రకటించాలని తుమ్మపాల గ్రామ రైతు సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతి అందించారు. కొన్ని ప్రాంతాల్లో శారదానది ప్రవాహం లేనందున పంటలు దెబ్బతిన్నాయన్నారు. దేవరాపల్లి ప్రాంతంలో రైవాడ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. జిల్లా అధికారులు ప్రస్తుత సమస్యలపై నివేదికను ప్రభుత్వానికి అందించి కరువు జిల్లాగా ప్రకటించేందుకు కృషి చేయాలని కోరారు.

క్వారీని పునరుద్ధరించరూ...

క్వారీ, స్టోన్‌క్రషర్లను నిలిపివేయడంతో ఉపాధి కోల్పోతున్నామని, ప్రజల ఉపాధిని దృష్టిలో ఉంచుకుని నిలిపివేసిన క్వారీలను పునఃప్రారంభించాలని అనకాపల్లి మండలం మండలం రొంగళివానిపాలెం సర్పంచ్ ఆర్.అప్పలనాయుడు, గ్రామస్తులు వినతి అందించారు. గ్రామానికి సమీపంలో సర్వే నెం.281లో గల క్వారీ నడపడం ద్వారా తమ గ్రామస్తులకు ఉపాధి కలుగుతుందన్నారు.

ల్యాండ్‌పూలింగ్‌కు భూములు ఇవ్వబోం.....

వేటజంగాలపాలెం గ్రామంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇవ్వబోమని రైతులు విన్నవించారు. తమ గ్రామంలో పూర్వకాలంగా భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ల్యాండ్ పూలింగ్ ద్వారా భూముల సేకరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఇవ్వమని చెప్పినా బలవంతంగా సేకరించేందుకు చర్యలు చేపడుతున్నారని, అటువంటి చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలిపారు.

విమానాల వింటర్ షెడ్యూల్ ఖరారు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలకు వింటర్ షెడ్యూలు ఖరారైంది. శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సీజనులో విమానయాన సంస్థలు విమాన సర్వీసుల సంఖ్యను పెంచుతూ ఉంటాయి. అయితే నవంబర్ 15 నుంచి మార్చి ఆఖరు వరకు విశాఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేను రీ-సర్ఫేసింగ్ చేయనున్నారు. ఇందుకోసం ఈ నాలుగున్నర నెలలు రాత్రి వేళ రన్‌వేను మూసివేస్తారు. ఆ మర్నాడు ఉదయమే తిరిగి తెరుస్తారు. అందువల్ల ఆ సమయంలో ఎయిర్‌పోర్టులోకి విమానాలను అనుమతించరు. ఈ నేపథ్యంలో విమానాశ్రయంలోకి రాకపోకలు సాగించే విమానయాన సంస్థలకు రీ-సర్ఫేసింగ్ దృష్ట్యా వేళలను సర్దుబాటు చేసుకోవాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇదివరకే సమాచారం అందించింది. దానికనుగుణంగా ఆయా సంస్థలు షెడ్యూల్‌ను మార్చుకున్నాయి. ఫలితంగా 32 విమాన సర్వీసులు తమ షెడ్యూల్‌ను మార్పులు చేర్పులు చేసుకున్నాయి. ప్రస్తుతం విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ఒక్కటే నడుస్తోంది. ఈ విమానం రోజూ రాత్రి 10 గంటలకు విశాఖ వచ్చి 11 గంటలకు బయలుదేరుతుంది. నవంబరు 15 నుంచి ఈ విమానం మూడు గంటలు ముందు అంటే.. రాత్రి ఏడు గంటలకే వచ్చి ఎనిమిది గంటలకు వెళ్తుంది. దీంతో పాటు చెన్నై, ఢిల్లీ, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, కడప, కోల్‌కతా, గోవా, జైపూర్, పోర్టుబ్లెయిర్, పూణే నుంచి వచ్చి, వెళ్లే దేశీయ విమాన సర్వీసులు కూడా తమ షెడ్యూల్ సమయాన్ని అరగంట నుంచి మూడు గంటల వరకు సర్దుబాటు చేసుకున్నాయి. కాగా రన్‌వే రీ-సర్ఫేసింగ్‌తో ఈ వింటర్ సీజనులో విమాన సర్వీసులు పెరగకపోగా కొన్ని తగ్గనున్నాయి.

పట్టపగలే చోరీ

• 6 తులాల బంగారు నగలు తస్కరణ

కశింకోట: నూతలగుంటపాలెం శివారు అచ్యుతాపురంలో సోమవారం పట్టపగలే దొంగలు ఆరు తులాల బంగారు నగలు ఎత్తుకుపోయారు. ఈ సొత్తు విలువ రూ.3 లక్షలు ఉంటుందని సమాచారం. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపిన వివరాలివి. అచ్యుతాపురానికి చెందిన అప్పికొండ లక్ష్మి వచ్చే నెల 3న తమ నూతన గృహ ప్రవేశానికి అవసరమైన పూజ సామగ్రి కొనుగోలు నిమిత్తం ఉదయం యలమంచిలి వెళ్లింది. అక్కడ సామగ్రి కొనుక్కొని తిరిగి మధ్యాహ్నం ఇంటికి వెళ్లగా, దాని తాళాలు పగులగొట్టి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాను పగులగొట్టి, దానిలో నాలుగు తులాల బంగారు గొలుసు, రెండు తులాల బంగారంతో చేసిన నల్లపూసల దండ మాయమయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి


తాతబ్బాయి మృతదేహం

ఎస్.రాయవరం: మండలంలోని పి.ధర్మవరం జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఐసర్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాద రావు తెలిపారు. గ్రామానికి చెందిన గంట్యాడ తాతబ్బాయి(56) తాపీమేస్త్రి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక రోడ్డు దాటుతుండగా యలమంచిలి నుంచి తుని వైపు వెళ్తున్న ఐసర్ వ్యాను అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదానికి గురయ్యాడని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ బుకీల అరెస్ట్

మర్రిపాలెం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వారిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసినట్లు సోమవారం విశాఖలో డీసీపీ - 1 కె.శ్రీనివాసరావు విలేకర్లకు తెలిపారు. బిర్లా జంక్షన్ వద్ద ఓ ఇంట్లో ఆన్‌లైన్‌లో వరల్డ్ కప్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిపై ఆదివారం రాత్రి సైబర్ క్రైం పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారు నెల్లూరుకు చెందిన విశ్వనాథరెడ్డి, ఎస్‌కే చాందని భాషా, విజయనగరానికి చెందిన లండా రామకృష్ణగా గుర్తించారు. ప్రధాన నిందితుడు విశ్వనాథరెడ్డిపై గతంలో కేసులున్నాయి. క్రికెట్ ఎక్స్ఛేంజ్, క్రికెట్ లైన్ వంటి యాప్‌లను ఆసక్తి గల వారిని డౌన్‌లోడ్ చేసుకోమని విశ్వనాథరెడ్డి బుకీగా వుంటూ బెంగుళూరులోని ప్రధాన బుకీ గణష్ ఆధ్వర్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటాడు. మిగతా ఇద్దరూ ఇతని వద్ద సహాయకులుగా పనిచేస్తుంటారు.

రిసార్ట్స్‌లో యువకుడి మృతి కేసులో సహోద్యోగి అరెస్టు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం కొండకర్లలోని ఒక ప్రైవేట్ రిసార్టులో విజయనగరానికి చెందిన సాయివర్మ మృతి చెందిన ఘటనకు సంబంధించి అతని సహ ఉద్యోగిని సోమవారం అరెస్టు చేశారు. మృతుడు సాయివర్మను స్విమ్మింగ్ పూల్‌లోకి తోసినట్టు సీసీ ఫుటేజ్ ఆధారాలు ఉండడంతో అతని స్నేహితుడైన రాజ్‌కుమార్‌ను సీఐ గఫూర్ అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఎస్పీ కార్యాలయానికి 46 ఫిర్యాదులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 46 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వారి అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబసమస్యలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా సమస్యలపై అర్జీలు అధికంగా వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్ఐ బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి మిత్ర బృందం వితరణ


రూ.21వేల సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రావికమతం : వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర అనారోగ్యంతో మంచంపై ఉన్న కొత్తకోట పడమటి శ్రీనివాసరావు అనే ప్రైవేటు టీచర్‌కు కొత్తకోట హైస్కూల్ 2008 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు(ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ గ్రూపు సభ్యులు) రూ.21వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. శ్రీనివాసరావు ప్రమాదంలో గాయపడి మంచంపై ఉండడం, అతని తల్లి గుండె సంబంధ వ్యాధితో మరో మంచంపై ఉండడంతో వృద్ధుడైన తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. దీనిపై అనుకోని ప్రమాదం..అంతులేని ఆవేదన శీర్షికన సాక్షిలో గత నెల 24న వార్త ప్రచురితం కావడంతో పలువురు స్పందించి శ్రీనివాసరావుకు సహాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఆ విద్యార్థులు సోమవారం నగదు, పండ్లు మిత్రునికి అందించారు.

అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయిని నాగజ్యోతి ప్రతిభ

• జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్‌లో రెండు బంగారు పతకాలు

రోలుగుంట: ఒక వైపు తన వృత్తి ధర్మాన్ని విస్మరించకుండా తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే... మరో వైపు తన ప్రవృత్తి అయిన ఆటల పోటీల్లో సత్తా చాటుతోంది. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని నాగజ్యోతి ఈ నెల 29న విశాఖ పోలీస్ బ్యారెక్స్ గ్రౌండులో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించింది. వంద మీటర్ల పరుగుతోపాటు డిస్కస్ త్రోలో స్వర్ణాలు కైవసం చేసుకుంది. వీటిని వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మంగా వరప్రసాద్, ఏఎస్పై ప్రదానం చేశారు. ఆమెను సోమవారం రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.ఎస్.వి. ప్రసాద్, ఉపాధ్యాయులు ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, వి.నాని, కిరణ్, రామశేషు తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయి బాక్సింగ్‌లో రఘుదర్శన్ ప్రతిభ


బాక్సింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన రఘుదర్శన్

సీతంపేట: బాక్సింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీడీఎఫ్ఐ) ఈ నెల 27 నుంచి 29 వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సీహెచ్.రఘుదర్శన్ సిల్వర్ మెడల్ సాధించాడు. గత ఏడాది కూడా ఈపోటీలలో సిల్వర్ మెడల్ సాధించాడు త్వరలో జరగబోయే పోటీల్లో బంగారు పతకం సాధిస్తానని రఘుదర్శన్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

స్థానిక కోచ్ అమ్మోరు వద్ద బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. రఘుదర్శన్‌ను కళాశాల కరాస్పాండెంట్ జి. మధుకుమార్, ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు అభినందించారు.

ప్లంబర్లకు రెండు రోజుల శిక్షణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో వాటర్ మేనేజ్‌మెంట్ ప్లంబ్లింగ్ కౌన్సిల్ వారి సహకారంతో మూడు సంవత్సరాల అనుభవం కలిగిన ప్లంబర్‌లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.రాజ్‌కుమార్ తెలిపారు. ఆధార్ లింక్ అయిన పాస్‌పుస్తకం మొదటి పేజీ జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్, రెండు ఫొటోలతో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రం, భోజనం, టీ-షర్ట్, మెటీరియల్ ఇస్తామని ఆయన తెలిపారు. అనుభవం ఉన్న ప్లంబర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

భర్త మృతదేహానికి భార్య తలకొరివి


భర్త మహేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న భార్య వీరలక్ష్మి

కశింకోట: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన భర్తకు పుట్టెడు దుఃఖంలోనూ భార్య తలకొరివి పెట్టిన హృదయ విదారక ఘటన సోమవారం కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన వేగి మహేష్ (58) అకస్మాత్తుగా మృతి చెందాడు. ఆయనకు మగ సంతానం లేరు. కుమార్తె ఉన్నారు. దీంతో భార్య వీరలక్ష్మి తలకొరివి పెట్టి బంధు మిత్రుల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కనకమహాలక్ష్మి వీధిలో మరిడిమాంబ ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్న మహేష్ కొన్నాళ్లు తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో సీజనల్ కార్మికునిగా పని చేశాడు. అద్దె టూరిస్టు బస్సుల్లో యాత్రికులను తీర్థ యాత్రలకు తీసుకెళ్తూ వచ్చిన కమీషన్‌తో కుటుంబ జీవనం సాగిస్తుండేవాడు. తమిళనాడులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని కాళ్లు దెబ్బతిని తీవ్రంగా గాయపడ్డాడు. కాళ్లకు రాడ్లు కూడా వేశారు. సరిగ్గా నడవ లేక అనారోగ్యంతో బాధపడుతూ అకస్మాత్తుగా మృతి చెందాడు. బంధువులు, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించిన మంత్రి




భాస్కర్‌కు చెక్కు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: బ్రెయిన్‌కు శస్త్ర చికిత్స చేయించుకున్న పట్టణానికి చెందిన కోలపర్తి కల్యాణభాస్కర్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష మంజూరైంది. ఈ చెక్కును మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వగృహంలో సోమవారం బాధితునికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. తలకు శస్త్రచికిత్స చేయించుకుని, పునర్జన్మ పొందిన భాస్కర్ పూర్తిగా కోలుకోవాలని అభిలషించారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సకల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లిటౌన్: గవరపాలెం అరుంధతినగర్ సచివాలయం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు పాల్గొని, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కంటి చూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ధర పెరిగిన ఉల్లి



కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో ఉల్లిపాయలు కిలో రూ.70కి పెరిగాయి. గత వారం కిలో రూ.50 ఉండగా, ఈ వారం అదనంగా రూ.20 పెరిగింది. టమాటా కిలో రూ.30 నుంచి రూ.40కి పెరిగింది. బంగాళాదుంప, వంకాయ రూ.30, దొండకాయ రూ.40, బెండకాయ, గోరు చిక్కుడు, బీట్రూట్, క్యారెట్, బీరకాయ, కాకరకాయ, బరబాటి రూ.60, క్యాప్సికం రూ.100, బీన్స్, ఆగాకర, పాదు చిక్కుడు రూ.120కి అమ్మకాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 3,000 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,500	4,500
మొదటి రకం	3,840	4,410
రెండో రకం	3,500	4,190
మూడోరకం	3,090	3,570

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
ఓటు చాలా విలువైనది (ఉ॥ మ॥)	
ధీమహి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-2 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 299 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

చాయ్.. చటుక్కునా తాగరా భాయ్!

టీ.. చాయ్.. పేరేదైనా.. ఓ గుక్క నోట్లో పడితే వచ్చే కిక్కే వేరు. చాలా మందికి ఉదయం, సాయంత్రం.. కొందరికైతే ఎప్పుడు దొరికినా టీ తాగేందుకు మొహమాటమే ఉండదు. దైనందిన ఒత్తిళ్లకు ఓ కప్పు టీతో చెక్ పెట్టేయొచ్చన్నది చాలా మందిలో ఉన్న మానసిక భావన. అందుకే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏ సెంటర్లోనైనా, రోడ్డు పక్కనైనా విరివిగా టీ దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ఇపుడు వీటికి కార్పొరేట్ లుక్ అద్ది.. ఫ్రాంచైజీలు కూడా వెలుస్తున్నాయి.

- పట్టణంలో వెలసిన వివిధ రకాల టీ దుకాణాలు
- జాతీయ రహదారి పక్కన పెరిగిన టీ స్టాళ్లు
- పలువురికి ఉపాధినిస్తున్న వైనం



వడకట్టిన టీ డికాక్షన్



టీ తాగుతున్న స్థానికులు

అనకాపల్లి రూరల్: ఆలోచనలు అస్తవ్యస్తంగా మారినా, తలంతా బరువుగా ఉన్నట్లనిపించినా వెంటనే గుర్తుకు వచ్చేది టీ. టీ లేనిదే చాలా మందికి రోజు గడవదు. నలుగురు ఓ చోట కలిసి మాట్లాడుకోవాలన్నా టీ కొట్టు దగ్గరికి వెళ్లాల్సిందే. సాక్షాత్తూ దేశ ప్రధాని మోదీ చాయ్‌వాలాగా సుపరిచితమే. ఇటీవల మోదీ చాయ్ పే చర్చా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారంటే మన దేశంలో టీకి ఉన్న ఆదరణ ఎంత గొప్పదో తెలుస్తోంది. టీ ప్రేమికుల అభిరుచులను దృష్టిలో పెట్టుకుని నేడు పెద్ద సంఖ్యలో టీ అవుట్‌లెట్లు వెలుస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ముగింపు దశలో ఉంది. రానున్నది శీతాకాలం దీంతో చల్లటి వాతావరణంలో వేడి వేడి టీ తాగితే ఆ మజాయే వేరంటున్నారు టీ ప్రియులు.

ఎన్నో రకాల టీలు

టీ ప్రియుల ఆసక్తికి అనుగుణంగా టీలలో ఎన్నో వెరైటీలు ఉన్నాయి. ఇరానీ టీ, గ్రీన్ టీ, లెమన్ టీ, అల్లం టీ, సొంటి టీ, మసాలా టీ, బెల్లం టీ, హనీ టీ, బాదం టీ, బ్లాక్ టీ, ఎలాచీ(యాలకుల) టీ ఇలా చాలా రకాల టీలు ప్రజాదరణ పొందుతున్నాయి. అనకాపల్లి పట్టణంలో సాధారణ టీలతో పాటుగా ఇరానీ టీ, గ్రీన్ టీ, లెమన్ టీలు తాగేందుకు ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. ఈ కొత్త రకం టీలకు గిరాకీ ఎక్కువగా ఉంటోందని టీ స్టాళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. ఇదివరకు ఒక కప్పు రూ.5 నుంచి రూ.10కి లభించేది. ఇపుడు రూ.10 నుంచిరూ.20కి చేరుకుంది. దీంతో చాయ్ కూడా ప్రియమైపోతోందని, అయినా తప్పదు భాయ్ అంటున్నారు టీ లవర్స్.

ఒత్తిడి నుంచి ఉపశమనం

చాలా మందికి రోజుకు మూడు నాలుగు సార్లు టీ తాగనిదే మనసు నిలువదు. ఎంతటి ఒత్తిడిలో ఉన్నా ఇక్క టీ తాగితే స్ట్రెస్ మొత్తం ఇట్టే తగ్గిపోతుందని టీ ప్రియులు చెప్తారు. ముఖ్యంగా యాలకుల టీ ఒత్తిడి, నొప్పుల నుంచి క్షణాల్లో ఉపశమనం కలిగిస్తుందని అంటున్నారు. ఆరోగ్యానికి మేలు చేసే టీలు కూడా ఎన్నో ఉన్నాయి. టీ తాగడం వలన మానసిక ఉత్తేజంతో పాటు గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని కూడా చెప్తారు. టీ తాగడం వలన బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నాయని వైద్యులు చెప్పే మాట. మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను గ్రీన్, బ్లాక్ టీలు దూరం చేస్తాయని పరిశోధనల్లో తేలింది. చర్మం ముడతలు పడకుండా చేసి, అందాన్ని కూడా పెంచేందుకు టీ ఉపకరిస్తుందట.

ఉపాధినిస్తున్న టీ స్టాళ్లు

టీ స్టాళ్లు ఏర్పాటు చేసుకోవడం నేడు మంచి వ్యాపార సాధనంగా మారింది. కొందరు సొంతంగా టీ స్టాళ్లు నడుపుతుండగా, కొన్ని సంస్థలు తమ బ్రాండ్ పేరుతో పట్టణాలు, గ్రామాలతో పాటుగా ఎన్‌హెచ్-16ను ఆనుకుని బ్రాంచీలను ప్రారంభిస్తున్నాయి. వీటి ఫ్రాంచైజీలను యువత తీసుకుని గిరాకీ ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకుని, ఉపాధి పొందుతున్నారు. తమతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ ఫ్రాంచైజీల్లో వెరైటీ టీలు లభిస్తుండటంతో టీ ప్రియులు వీటి వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు.

రోజుకు వెయ్యి టీలు విక్రయిస్తాను



మాది విజయవాడ. అక్కడ మా బంధువులకు టీ దుకాణం ఉంది. ఆ అనుభవంతోనే ఇక్కడి బస్ కాంప్లెక్స్ వద్ద ఏడేళ్ల క్రితం టీ స్టాల్ పెట్టాను. నేను, నా భార్య, కొడుకు దీన్ని నిర్వహిస్తాం. రోజూ వెయ్యి మందికి పైగా మా వద్ద టీ తాగుతారు. ఇక్కడ ఇరానీ టీ తాగేందుకు చాలా మంది ఆసక్తి చూపుతారు. ఆదరణ బాగుంది. మా బంధువులు ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడుచోట్ల టీ దుకాణాలు నిర్వహిస్తూ జీవిస్తున్నారు.

– మాదిశెట్టి శ్రీరాములు, టీ దుకాణం యజమాని

పదేళ్లుగా టీ స్టాల్ నిర్వహిస్తున్నా



పదేళ్లుగా టీ స్టాల్ నిర్వహణతోనే ఉపాధి పొందుతున్నాను. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో టీ తాగడం వలన ఉపశమనం లభిస్తుందని టీ ప్రియులు చెబుతున్నారు. ఒక కప్పు టీకి రూ.6 నుంచి రూ.10 వరకు తీసుకుంటున్నాం. గతంలో కంటే ఇపుడు టీలో వెరైటీలు ఎక్కువయ్యాయి. వెరైటీ టీలు తాగేందుకు ఇష్టపడేవారు కూడా పెరిగారు. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా పలురకాల టీలు తయారుచేసి, విక్రయిస్తున్నాం.

– పిండి చిన్నా, అనకాపల్లి

చెర్లోపల్లి గ్రోయిన్ పరిశీలించిన అధికారులు

- మంత్రి అమర్‌నాథ్ ఆదేశాలతో చర్యలు



చెర్లోపల్లి గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న జల వనరుల శాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి రూరల్: మండలంలోని దిబ్బపాలెం సమీపంలో శారదానదిపై ఉన్న చెర్లోపల్లి గ్రోయిన్‌ను జల వనరుల శాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం పరిశీలించారు. దెబ్బతిన్న గ్రోయిన్‌ను విశాఖపట్నం జల వనరుల శాఖ ఎస్ఈ త్రినాథరావు, డీఈ శ్రీచరణ్‌లు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రోయిన్ ఆయకట్టు భూములకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నీటిని విడుదల చేయడానికి వీలుగా తక్షణ మరమ్మతుల కోసం చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రోయిన్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన అంచనా వ్యయానికి సంబంధించి నివేదికను తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారుల నివేదిక మేరకు నిధులను మంత్రి అమర్‌నాథ్ ఆదేశాలతో మండల పరిషత్ నిధుల నుంచి విడుదల చేస్తామని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. అనంతరం ఆ ప్రాంత రైతులతో అధికారులు చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి పెద్దాడ రాంశంకర్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, సీపీఐ జిల్లా నేత వైఎస్ భద్రం, రైతు సంఘం నాయకులు కొరిబిల్లి శంకరరావు, పీలా బుజ్జి, లక్ష్మీదేవి పేట, మళ్ల వీధి, కోట్ని వీధి, తుమ్మపాల ప్రాంతాల రైతులు, జలవనరుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల కార్యాచరణపై గ్రామ సభలు



అక్కిరెడ్డిపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు



గోపాలపురంలో రంగుల చిత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లిటౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో భాగంగా ఏయే పనులు చేపట్టాలి, ఎలా చేయాలి అనే అంశంపై మండలంలోని గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో సోమవారం గ్రామ సభలు జరిగాయి. ఈ సభలకు ఎంపీపీ గొర్లి సూరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అవసరమైన ప్రతి పనినీ గుర్తించి, నాణ్యతా ప్రమాణాలతో చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, నీరు నిలిచి ఉండేలా కొండలపై ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మొక్కల సంరక్షణకు ఒక మనిషిని ఏర్పాటు చేసి, వాటి పెంపుదలకు కృషి చేయాలని సూచించారు. గోపాలపురం గ్రామంలో గ్రామ చిత్రపటాన్ని వేసి, భవిష్యత్ కార్యాచరణను ఏపీవో సుప్రియ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జెర్రిపోతుల లక్ష్మి, సాలాపు శాంతి, ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శి గుణలక్ష్మి, వార్డు మెంబర్లు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకాయుక్తలో ఫిర్యాదుకు పరిష్కారం

అనకాపల్లిటౌన్: స్థానిక ఉడ్‌పేటలో ఉన్న పాత వాటర్ ట్యాంకును తొలగించాలంటూ లోకాయుక్తకు చేసిన ఫిర్యాదుకు పరిష్కారం లభించినట్లు సోషల్ వర్కర్ కె.సాయిబాబా సోమవారం తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 1964లో అప్పటి పట్టణ జనాభాకు తగ్గట్టుగా 800 కేఎల్ సామర్థ్యం గల వాటర్ ట్యాంకును నిర్మించారు. ఈ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో 2012 జూలై 22న జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు నూతన ట్యాంకు నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకు తొలగించకుంటే సమీపంలో ఉన్న అపార్టుమెంట్లు, పాదచారులపై కూలిపోతుందేమేమోనన్న భయాందోళన నెలకొంది. దీనిపై 2017 సెప్టెంబర్ 24న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.జీవీఎంసీ అధికారులు పాత వాటర్ ట్యాంకును 2022 జూలై 20న తొలగించారు. లోకాయుక్తకు 2023 ఆగస్టు 31న లిఖితపూర్వకంగా సమాచారం అందించారు. లోకాయుక్త జడ్జి పి.లక్ష్మణరెడ్డి సమస్య పరిష్కారమైందంటూ సోషల్ వర్కర్‌కు సోమవారం లిఖితపూర్వకంగా సమాచారమిచ్చారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



బంగారయ్యపేటలో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, స్థానికులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట ఎస్సీ కాలనీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో వి.వి.రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, నీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. డి-ఫారం పట్టా భూములు అన్యాక్రాంతం కాకుండా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని బాధితుల వినతి మేరకు, ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.నాగాయమ్మ, హెచ్‌డీటీ కె.సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యారావు, హెచ్‌డబ్ల్యూఓ.నిర్మల, ఏఎస్ఐ కె.రమణమ్మ, వార్డు సభ్యుడు కుందెల లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల భద్రతపై అవగాహన



రెవెన్యూ రికార్డుల భద్రతపై డీటీకి సూచనలిస్తున్న ఎస్‌డీసీ రవీంద్రరావు

సబ్బవరం: రెవెన్యూ గ్రామాల వారీగా రికార్డులు భద్రపరచాలని కోనేరు రంగారావు కమిటీ(కెఆర్ఆర్‌సీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు భద్రపరిచే రూమ్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. మండలంలో ఉన్న 33 రెవెన్యూ గ్రామాల రికార్డులను క్రమపద్ధతిలో భద్రపరచాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. వారం రోజుల్లో మరోసారి వచ్చి రికార్డు రూమ్‌ను పరిశీలిస్తానని అప్పటికి ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. డిజిటల్ అసిస్టెంట్‌కు రికార్డుల రూమ్ నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్,రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు సీజ్



గ్రావెల్ తరలిస్తుండగా సీజ్ చేసిన లారీ

సబ్బవరం: మండలంలోని అసకపల్లి శివారు నక్కవానిపాలెం సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఓ ప్రైవేటు ల్యాండ్‌లో అక్రమంగా స్టాక్ వేసిన గ్రావెల్‌ను పొక్లెయిన్‌తో లారీలకు లోడ్ చేస్తుండగా మైనింగ్ అధికారులు సోమవారం పట్టుకొని సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ స్వాతి తెలిపారు.మైన్స్ ఏడీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు దాడులు చేసి వాహనాలు సీజ్ చేయడంతో పాటు అపరాధరుసుం వసూలు చేయనున్నట్లు చెప్పారు.మైనింగ్ చట్టం ప్రకారం మట్టి,గ్రావెల్ అనుమతులు లేకుండా తరలించకూడదన్నారు. స్టాక్ చేసిన గ్రావెల్ ఎలా వచ్చిందో విచారణ చేపట్టి అనంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష



సంపతిపురం వైద్య శిబిరంలో రోగికి మందులు అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు



శిబిరంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ స్టాల్



సంపతిపురం శిబిరంలో మహిళను పరీక్షిస్తున్న వైద్యుడు



నడవలేని రోగి వద్దకే వెళ్లి అనారోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైద్యుడు

- సంపతిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం
- 452 మందికి ఓపీ సేవలు, రిఫరల్ కేసులు 29

అనకాపల్లి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని సంపతిపురం గ్రామంలో సచివాలయం వద్ద సోమవారం జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ వైద్య సేవలందించేందుకు ఇంటింటా ఆరోగ్య సర్వే జరిపి, ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తోందన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ప్రజల ఆరోగ్యం కోసం 104, 108, ఆరోగ్యశ్రీ సేవలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదే బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఖరీదైన వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందిస్తున్నారని కొనియాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని 452 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందించారు. 29 మందిని మెరుగైన చికిత్స కోసం జిల్లా, ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. పలువురు గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులకు పోషకాహార ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. గ్రామ సర్పంచ్ గూన నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు భీశెట్టి జగన్, పల్లా శ్రీనివాసరావు, రమణ గోవింద్, నాగేశ్వరరావు, కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి త్రినాథరావు, పలువురు అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ కలయికలో జీవీఎంసీ హైస్కూల్ 1986-87 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లిలోని జీవీఎంసీ హైస్కూల్లో 1986-87 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల మొదటి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాల సమీపంలోని తోటలో సోమవారం విద్యార్థులు సమావేశమయ్యారు. ఒకరినొకరు గుర్తుపట్టి, ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను, అప్పటి అల్లరి చేష్టలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆటపట్టించుకుంటూ, ఆట పాటలతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సామూహిక ఫోటోలకు ఫోజులిచ్చారు. మధురానుభూతులతో సాయంత్రం తిరుగుముఖం పట్టారు. కార్యక్రమంలో ఈ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, విజయవాడ ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ కర్రి అప్పారావు, వాతావరణ శాఖ ఉద్యోగి సుధీర్, ఉపాధ్యాయుడు చొప్పా అప్పారావు, పూర్వ విద్యార్థులు ఆరుగుళ్ల అప్పారావు, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా బల్లా



పదోతరగతి పూర్వ విద్యార్థులతో ఏర్పాటైన నూతన కమిటీ

అనకాపల్లిటౌన్: గవరపాలెం జీవీఎంసీ చిన్నహైస్కూల్ 1970-73 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా బల్లా నాగభూషణం ఎన్నికయ్యారు. స్థానిక నూకాంబిక అమ్మవారి రహదారి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షుడిగా బొడ్డేడ అప్పారావు, కమిటీ చైర్మన్‌గా పిల్లా శివఅప్పారావు, కార్యదర్శిగా దాడి శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రొబ్బి చంద్రరావు, సహాయ కార్యదర్శిగా పీలా వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా పట్నాల కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులుగా కర్రి సత్యనారాయణ, విల్లూరి సాయి, మైలపల్లి నూకరాజు, కె.రామారావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బల్లా నాగభూషణం మాట్లాడుతూ ఈ ఏడాది పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనా(వన సమారాధన)న్ని కుటుంబ సమేతంగా మండలంలోని శంకరం గ్రామ పంచాయతీ బొజ్జన్న కొండవద్ద డిసెంబర్ 17న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్టు

కశింకోట: కశింకోట వద్ద శారదానది ఒడ్డున పేకాట ఆడుతున్న ఐదుగుర్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సోమవారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి దాడి చేసి, నిందితులను పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.840 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

2న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో వచ్చే నెల 2వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ఏవో షేక్ బాబూరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా పాల్గొవాలని కోరారు.